క్లుప్తంగా

రెండున మాదిగ విశ్వరూప మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాకినాడ సిటీ: ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో వచ్చేనెల రెండో తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ పిలుపు నిచ్చారు. శుక్రవారం కాకినాడ జగన్నాథపురం గోలిపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఓటు బ్యాంక్ రాజకీయం వల్ల ఎస్సీ వర్గీకరణ బిల్లును నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రస్తుత వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదించేలా రాజకీయ పార్టీలపై ఈ సభ ద్వారా ఒత్తిడి చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీస్ నాయకులు శెట్టి రామకృష్ణ, వల్లూరి సత్తిబాబు, నవీన్ తదతరులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్లను గుర్తించాలి



కరపలో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: గ్రామాల్లోని పాఠశాలల వారీగా బడిఈడు పిల్లలను గుర్తించి, తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయాల ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో పాటు, ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ–2 ప్రత్తి సత్యనారాయణలతో సమావేశమై జీఈఆర్ యాప్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) ద్వారా వచ్చే డ్రాప్ అవుట్స్‌పై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. గ్రామ వలంటీర్లతో సర్వే చేయించగా మిగిలిపోయిన 219 మంది వివరాలను సేకరించి డేటాను సోమవారానికి అందజేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్పించేలా చైతన్య పరచాలన్నారు.


మౌలిక వసతులు ప్రారంభం



మౌలిక వసతులను ప్రారంభిస్తున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి వసంతలక్ష్మి

బాలాజీచెరువు: విద్య, వైద్యానికి సాయంతో పాటు దేవాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సహకారం చేస్తున్న హరీష్ చారిట్రబుల్ ట్రస్ట్ కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం వారు సమకూర్చిన మంచినీటి సౌకర్యం, మౌలిక సదుపాయలు ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ జిల్లా క్రీడా మైదానానికి దాదాపు 25 లక్షలతో మౌలిక సదుపాయాలు, క్రీడా స్థలం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఉపాధి కల్పన అధికారి శ్రీనివాసరావు, శిరీష, జిల్లా క్రీడా సాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు రవికిరణ్, శేఖర్, వీరబాబు పాల్గొన్నారు.

కేసీబీఎస్‌లో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ

కాకినాడ: కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ (కేసీబీఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంస్థ సభ్యులకు శుక్రవారం కిడ్నీ సమస్యలు–తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ పల్లపోటు రవీంద్ర, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సీమకుర్తి సూర్యనిహార్ పలు సూచనలు సలహాలు ఇచ్చి, వైద్య సేవలు అందించారు. అంతకు ముందు సంస్థ మాజీ అధ్యక్షుడు కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు సంస్థ ప్రతినిధులు నివాళులర్పించారు. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్ర కుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాయి లీలలపై ప్రవచనాలు

కాకినాడ కల్చరల్: స్థానిక భాస్కర్‌నగర్‌లోని శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో ప్రవచనకర్త కేవీవీ రామకృష్ణ శుక్రవారం సాయి జీవిత చరిత్ర ఘట్టాలపై ప్రవచనం చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ పలక ఆదిత్య శేఖర్, అర్చకులు చక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు లేని నగరమే లక్ష్యం

- డిసెంబర్ నాటికి అభివృద్ధి పనులు పూర్తి
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. నగరాన్ని సమస్య రహితంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక 33వ డివిజన్ కామేశ్వరి నగర్‌లో రూ.48 లక్షలతో ప్రతిపాదించిన రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. సకల మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిపాదించిన పనుల్లో చాలా వరకు పూర్తయ్యాయని, మిగిలినవి డిసెంబర్ నాటికి పూర్తవుతాయన్నారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, స్థానిక నాయకులు బోరా వెంకటేశ్వరరావు (పెద్ద), మాజీ కార్పొరేటర్లు నల్ల బిల్లి సుజాత, పోలిశెట్టి పద్మావతి, రోకళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎంతో మేలు

కాకినాడ: జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు కలిగిందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 7వ డివిజన్ రేచర్లపేట, 45వ డివిజన్ కొండయ్యపాలెం, 12వ డివిజన్ రెవెన్యూకాలనీ ప్రాంతాల్లో శుక్రవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొని ఆయా ప్రాంతాల ప్రజలకు మంజూరైన వివిధ రకాల ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. దళారీ వ్యవస్థకు తావులేకుండా ప్రజల వద్దకు పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రజలకు అందిన సేవలతో ప్రజాప్రతినిధిగా తనకు ఎంతో సంతృప్తి కలిగిందన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఆయా డివిజన్ల స్థానిక నాయకులు సిగల మధు, తొంపల తాతారావు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఇంట ఎక్కువ ఓటర్లను గుర్తించండి

- ఎలక్టోరల్ అధికారి సత్యనారాయణ
- 50వ డివిజన్‌లో జాబితా పరిశీలన



ఓటర్ల జాబితా పరిశీలించి మాట్లాడుతున్న ఈఆర్ఓ సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఎన్నికల సంఘం ముసాయిదా ప్రకారం సంక్షిప్త ఓటర్ల పరిశీలన జరుగుతోందని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటినీ కచ్చితంగా సందర్శించి ఒకే ఇంటిలో ఎక్కువ ఓటర్లు ఉంటే గుర్తించాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్వీవీ సత్యనారాయణ కోరారు. నియోజకవర్గ పరిధిలో కాకినాడ అర్బన్ 50వ డివిజన్‌లోని 111వ పోలింగ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా ప్రకారం ఓట్లు పరిశీలించారు. ఈనెల 21 నుంచి సంక్షిప్త ఓటర్ల పరిశీలన జరుగుతోందన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీ ప్రతినిధులు మాత్రమే బూత్ స్థాయి ఏజెంట్లుగా గుర్తించాలని సూచించారు.

శ్మశానాల సమస్య పరిష్కరించండి

కాకినాడ సిటీ: జిల్లాలో అనేక గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న దళితుల శ్మశాన భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాస్‌ను కేవీపీఎస్ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో తాళ్లరేవు, కాజులూరు, పిఠాపురం మండలాల్లోని పి.తిమ్మాపురం, కరప మండలం గొర్రిపూడి తదితర గ్రామాలతో పాటు అనేక మండలాల్లో దళిత గ్రామాల్లో శ్మశానాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశానాలు లేని గ్రామాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో శ్మశానాలకు భూములను కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్, బుడితి సురేష్‌కుమార్, సింహాచలం, విప్పర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



కాలక్షేప మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

బోట్‌క్లబ్: ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. స్థానిక భానుగుడి సెంటర్‌లోని భానులింగేశ్వర ఆలయంలో భక్తుల కోసం రూ.14 లక్షలతో నిర్మించిన కాలక్షేప మండపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పురాతన ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఈ మండపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు), ఈఓ ఎం మురళీవీరభద్రరావు ఘన స్వాగతం పలికారు. కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత పాల్గొన్నారు.

నేటి నుంచి నర్సీపట్టణానికి అల్ట్రా డీలక్స్



కాకినాడ: ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం నుంచి కాకినాడ–నర్సీపట్నం మధ్య కొత్త అల్ట్రా డీలక్స్ సర్వీస్ ప్రారంభిస్తున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. ఈ సర్వీస్ ఉదయం 5.45 గంటలకు కాకినాడలో బయలుదేరి 9 గంటలకు నర్సీపట్నం చేరుతుందన్నారు. తిరిగి 9.45కు నర్సీపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు కాకినాడ చేరుతుందని చెప్పారు. ఇదే సర్వీస్ మధ్యాహ్నం 1.45 కు కాకినాడలో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు నర్సీపట్నం చేరుకుని, తిరిగి అక్కడి నుంచి 5.45 గంటలకు నర్సీపట్నంలో బయలుదేరి రాత్రి 9 గంటలకు కాకినాడ చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుష్య జలాలను మళ్లించండి

అధికారులకు కమిషనర్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య జలాలను బిక్కవోలు డ్రైన్‌లో కలిసేలా మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య వ్యర్థాలు, జలాలను సామర్లకోట కెనాల్‌లో వదులుతున్నారన్నారు. మేడపాడు, వేట్లపాలెం, బలభద్రపురం, హుస్సేన్‌పురం పంచాయతీల నుంచి వచ్చే డ్రైనేజీ నీటితో పాటు కాలుష్య జలాలను ప్రత్యామ్నాయంగా మళ్లించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వేమగిరి నుంచి అనపర్తి వరకు పంచాయతీల నుంచి వచ్చే ఘన, ద్రవ వ్యర్థాలపై కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఎల్ఓలతో సమావేశం

ఓటర్ల గుర్తింపు సర్వేపై కమిషనర్ మహేష్‌కుమార్ శుక్రవారం ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజరీ అధికారులతో సమీక్షించారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సర్వేను సమగ్రంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, తహసీల్దార్ సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీలపై దృష్టిపెట్టండి

మెరుగైన పారిశుధ్యం కోసం ప్రతిపాదించిన యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కమిషనర్ మహేష్ కుమార్ సంబంధిత సిబ్బందికి సూచించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో యూజర్ చార్జీల వసూళ్లు, ఆస్తి పన్నుల వసూళ్లపై శుక్రవారం సాయంత్రం శానిటేషన్, రెవెన్యూ అధికారులు, ప్రత్యేక, నోడల్ అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించే లక్ష్యంతో హూపర్‌టిప్పర్ వాహనాలను, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఇంటింటి నుంచీ చెత్త సేకరిస్తున్నామని అన్నారు. ఇందుకు అయ్యే లక్షలాది రూపాయల వ్యయాన్ని యూజర్‌చార్జీల ద్వారా మాత్రమే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే నగరంలోని ఆయా డివిజన్లలో ఖాళీ స్థలాలను, వాటి యజమానులను గుర్తించి అక్కడ చెత్త వేయకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, అధికారులు పాల్గొన్నారు.

బాలుడికి రక్తదానం

కరప: గ్రామానికి చెందిన దేవదాయశాఖ చిరుద్యోగి వితరణతో తలసేమియాతో బాధపడుతున్న బాలుడికి రక్తం సమకూరింది. కోటనందూరుకు చెందిన ఈ.ఈశ్వర్ అనే బాలుడికి బి నెగిటివ్ రక్తం అవసరంకాగా స్థానిక మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలుకు తెలియచేశారు. ఆయన తనకు తెలిసిన గ్రూప్‌లో సమాచారం పెట్టగా మాజీసర్పంచ్ కరప గ్రూపు టెంపుల్స్‌లో అటెండర్ చీర్ల శ్రీనివాస్ స్పందించి శుక్రవారం కాకినాడలోని రెడ్‌క్రాస్ సంస్థలో 29వ సారి రక్తదానం చేశారు.

హెపటైటిస్‌పై నిర్లక్ష్యం వద్దు

కాకినాడ రూరల్: కాలేయ వ్యాధిని పెంచి ప్రాణాంతకమయ్యే అవకాశం ఉన్న హెపటైటిస్ వ్యాధులపై నిర్లక్ష్యం, అశ్రద్ధ వద్దని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ కోరారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విజయవాడలో రాష్ట్ర సదస్సు

కాకినాడ సిటీ: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, కార్పొరేట్ దుష్పరిపాలన నుంచి రైతులను శ్రామికులను కాపాడాలని కోరుతూ ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని మధు డిమాండ్ చేశారు. వచ్చేనెల 3, 4 తేదీల్లో సీపీఐ శాఖ కార్యదర్శుల సదస్సు జరుగుతుందన్నారు.

వసతిగృహం తనిఖీ



హాస్టల్‌ను పరిశీలిస్తున్న జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: స్థానిక భానుగుడి వద్ద సాంఘిక సంక్షేమ వసతిగృహం ఆనంద నిలయాన్ని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పించిన వసతులు, సదుపాయాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి లోవరాజు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి జి.జాన్‌బాబు, సర్పవరం పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షిద్దాం



నేమాం–4 లే అవుట్‌లో మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఇలక్కియ, పీడీ వెంకటలక్ష్మి

కాకినాడ రూరల్: ప్రకృతి పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని జేసీ, ఇన్‌చార్జి కలెక్టర్ ఇలక్కియ పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేమాం–4 లే అవుట్‌లో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, గ్రామ సర్పంచ్ రామదేవు సూర్యప్రకాష్‌రావు (చిన్న) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం అందజేసిన స్థలాలలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలన్నారు. డ్వామా ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఏపీడీ వసంతమాధవి, డీఎల్‌డీవో నారాయణమూర్తి, భానుప్రకాష్, రమేష్, ఈవో పీఆర్డీ రమేష్, ఏపీవో కొండలరావు, ఉపాధి హామీ సిబ్బంది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాక్కాయ... విరగ కాసిందయ్యా..



విరగ కాసిన వాక్కాయ చెట్టు



వాక్కాయలు

పిఠాపురం: నీటి ఆధారం అవసరం లేదు.. చీడపీడల బెడద అసలే ఉండదు.. పశువులు, పక్షులు తినేస్తాయనే భయపడాల్సిన పని లేదు.. ఆ చెట్లకు ఉన్న ముళ్లే వాటికి రక్షణ అవేనండి చెట్ల పాదలు కంచెల్లో కనిపించే వాక్కాయ చెట్లు. గ్రామీణ ప్రాంతాల్లోని పుంత రోడ్లలో వెళుతుంటే ఎక్కడ పడితే అక్కడ ఈ చెట్లు కనిపిస్తుంటాయి. ఒక్క కాయ నోట్లో వేసుకుని పని చేస్తుంటే వారికి ఇక అలసటనేదే ఉండదంటున్నారు రైతు కూలీలు. దీని శాస్త్రీయ నామం కరోండా. ఈ కాయలనే చెర్రీ ఫ్రూట్స్ తయారీకి ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో పొలాల గట్లపై కంచెల్లో వాటంతట అవే పెరుగుతుంటాయి. చెర్రీ ఫ్రూట్స్‌కు గిరాకీ ఉండడంతో వీటికి డిమాండ్ పెరిగింది. ప్రకాశం జిల్లాలో వాక్కాయ తోటలు పెంచుతున్నారంటే వీటికి గిరాకీ ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వాక్కాయల ధర పచ్చివే కేజీ రూ.50 వరకు పలుకుతుంది. వీటిని కూరల్లో సైతం ఉపయోగిస్తారు. సి విటమిన్ ఎక్కువగా ఉండే వీటిని పచ్చివి, పళ్లు తింటుంటారు. అత్యంత పుల్లగా ఉండే వీటిని పచ్చళ్ల తయారీకి ఉపయోస్తారు. గొల్లప్రోలు మండలం పుంత రోడ్లకు ఇరు వైపులా ఉన్న కంచెల్లో పలు వాక్కాయ చెట్లు ఉండడంతో ఆ దారిన వెళ్లేవారు వీటిని కోసుకుంటున్నారు.

ప్లాస్టిక్ వినియోగం మానేద్దాం

- జ్యూట్ బ్యాగులు వాడేద్దాం
- డీపీటీఓ శ్రీనివాసరావు



ప్రయాణికులకు జ్యూట్ బ్యాగులు అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ: పర్యావరణ పరిరక్షణకు నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేసి జ్యూట్ బ్యాగులు, క్లాత్ సంచులను వినియోగించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఓఎన్‌జీసీ, ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సమతుల్యతపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఓఎన్‌జీసీ సహకారంతో సుమారు 200 జ్యూట్ బ్యాగులను బస్‌స్టేషన్‌లోని ప్రయాణీకులకు పంపిణీ చేశారు. ఓఎన్‌జీసీ హెచ్‌ఆర్ మేనేజర్ మహ్మద్ అన్వర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలు భానుమతి, కోశాధికారి పద్మజా రాణి, డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం



రోగికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: మధుమేహ వ్యాధిపై అవగాహన ఉండాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ చప్పిడి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. గాంధీనగర్ అశ్విని ఆస్పత్రిలో ఈ వ్యాధికి శుక్రవారం ఉచిత పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే నివారణ చాలా వరకూ సాధ్యపడుతుందన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ పీఆర్ఓ మాటూరి శిరీష, వైస్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, పెంకే గోవిందరాజు, కొత్త శ్రీరాములు సభ్యులు పాల్గొన్నారు.

31 నుంచి ఏపీఓ, ఏపీఎంలకు శిక్షణ



సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలోని ఏపీఎంలు, ఏపీఓలు, కొంత మంది ఎంపీడీఓలకు ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ రెండో తేదీ వరకు ఏడు బ్యాచ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్టు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామ రాజు, తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదారి, ఏలూరు జిల్లాలోని 432కి శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణలో మునగ ఆకు ప్రాధాన్యాన్ని వివరించి వాటి పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటి వినియోగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

పిఠాపురం: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని సారా బట్టీలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ అజయ్ కుమార్ సింగ్, ఎక్సైజ్ సీఐలు సునీల్ కుమార్, నాగవల్లీ తమ సిబ్బందితో పిఠాపురం మండలం కొత్తకొంపలలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 25 ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు ఇక్కడి నుంచే సారా సరఫరా చేస్తున్నట్టు గుర్తించిన అధికారులు ఆయా గ్రామాలపై నిఘా ఏర్పాటు చేశారు. పిఠాపురం ఎక్సైజ్ సీఐ నాగవల్లీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

పిఠాపురం: నియోజకవర్గంలో పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాలు, పిఠాపురం పట్టణ పరిధిలో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. పిఠాపురం మండలం విరవలో పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.11,050 స్వాధీనం చేసుకున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో సాయిబాబా గుడి వద్ద పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసిన గొల్లప్రోలు పోలీసులు వారి నుంచి రూ.1570 స్వాధీనం చేసుకున్నారు. పిఠాపురం పట్టణ పరిధిలోని మార్కెట్ వద్ద పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసిన పట్టణ పోలీసులు వారి నుంచి రూ.7050 స్వాధీనం చేసుకున్నారు.